TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు  తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY


విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 287 | సోమవారం జూన్ 23 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల -5

# నాన్ ట్యాక్స్ రెవెన్యూపై అధికారులు దృష్టిపెట్టాలి



»నాన్ ట్యాక్స్ రెవెన్యూ పెంపు: నాన్ ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

»సంక్షేమ పథకాల అమలు: గత ప్రభుత్వ పథకాలను ఆపకుండా, కొత్తగా రూ. 33,600 కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం.

»ఆదాయ లోటు: 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఓఆర్ఆర్ (అవుటర్ రింగ్ రోడ్డు), ఎక్సైజ్ ఆదాయాలు రాలేదు.

»కొత్త పథకాలు: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నాం.

»బడ్జెట్ కేటాయింపులు: బడ్జెట్ నిధులు కొన్ని శాఖలకు అధికంగా, మరికొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయి. అన్ని శాఖలకు సమానంగా బడ్జెట్ పంచాలి. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి, అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలి.

హైదరాబాద్: నాన్ ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ సబ్ కమిటీ ఛైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో జరిగిన అసెట్స్ సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మంత్రులు, కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మిగతాది 2లో

# 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'..

## మావోయిస్టులకు అమిత్ షా హెచ్చరిక



**ఈసారి వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.**

వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పుర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. "ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు.

2లో

## ఆ 6 డిమాండ్లు నెరవేర్చాలి..

## మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ



మిగతాది 2లో

తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు.

# ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయం




కరీంనగర్: అందరి సహకారంతో అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని మంత్రులు వ్యాఖ్యానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయంపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయమని, ఈ విషయంలో పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి శ్రీధర్‌బాబు తేల్చి చెప్పారు. వ్యవసాయానికి పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాలో ఒక్క గుంట కూడా బీడు భూమి లేకుండా సాగుచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు వివరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

# గతంలో పనిచేసిన సంస్థకే కన్నం.. రూ.48


## లక్షలు చోరీ చేసిన నిందితుడు అరెస్ట్



మిగతాది 2లో

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు

»ఎందరో పౌరుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.



మిగతాది 2లో

సికింద్రాబాద్: ఎందరో పౌరుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఈటల మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనను కొనియాడారు.

# యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం



మిగతాది 2లో

»యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

# సంపాదకీయం

## ఫోన్ ట్రాప్‌లో పడేదెవరో..?

తెలంగాణలో చోటుచేసుకున్న టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాక రేపుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ జరిగింది. దీనిపై దర్యాప్తు చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉప ఎన్నిక అయినా, సాధారణ ఎన్నికలైనా ప్రత్యర్థులను కట్టడి చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌ను బ్రహ్మాస్త్రంగా వాడుకుంది. ఫోన్లు దొంగచాటుగా వినడం తీవ్ర నేరమన్న విషయం మరచి విచ్చలవిడిగా వందల మంది ఫోన్ సంభాషణలను విన్నారు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందినవారు కూడా బాధితులుగా మిగిలారు. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగానే కేసీఆర్ ఒకప్పుడు హరీశ్‌రావ్, ఈటల రాజేందర్‌లను పక్కన పెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను శాసించడానికి కూడా కేసీఆర్ ఈ అస్త్రాన్నే ఎంచుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా 2019 ఎన్నికల్లో ఆయనకు హైదరాబాద్ నుంచి నిధులు అందకుండా కట్టడి చేశారు. షర్మిల ఫోన్లతో పాటు ఆమె అనుయాయుల ఫోన్లను ట్యాప్ చేసి తన ఆప్త మిత్రుడైన జగన్‌రెడ్డికి ఆ వివరాలు అందించారు. దీంతో ఆ ఇరువురి మధ్య ఏర్పడిన బంధం ఫెవికాల్ కంటే దృఢమైనదని రుజువైంది. రక్తసంబంధం కంటే కేసీఆర్%–%జగన్ మధ్య బంధమే బలమైనదని షర్మిల సైతం వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం ద్వారా ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇరికించిన కేసీఆర్.. అప్పటి నుంచే ట్యాపింగ్ రుచి మరిగారు. ఇందుకోసం ప్రభాకరరావు, రాధాకిషన్‌రావు వంటి అధికారులను వాడుకున్నారు. పాపం పండుతుంది అంటారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ పాపం పండుతోంది. ఈ వ్యవహారంలో దర్యాప్తు సజావుగా పూర్తయితే ఇటు కేసీఆర్, అటు జగన్‌రెడ్డి కూడా ఇరుక్కుపోతారు. రికార్డు చేసిన తన వాయిస్‌ను తన చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి తనకే వినిపించారని షర్మిల చెప్పుకొచ్చారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి కోసం కేసీఆర్ ట్యాపింగ్ చేయించారని అర్థమవుతోంది. టెలిఫోన్ ట్యాపింగ్ అనేది ఇప్పుడు సర్వసాధారణం అయిపోయింది. అందుకే ప్రజలు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. అయితే తెలంగాణలో హైకోర్టు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ చేయించడం ద్వారా కేసీఆర్ ప్రభుత్వం సరికొత్త రికార్డులు సృష్టించింది.

మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా వ్యక్తిగత గోప్యత మౌలిక హక్కు. ఇప్పుడు ప్రభుత్వాలే ఈ హక్కును హరిస్తున్నాయి. నియమ నిబంధనలు పాటించకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం తీవ్ర నేరంగా ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం పేర్కొంటోంది. ప్రజల భద్రత, అంతర్గత శాంతిభద్రతలు వంటి కారణాలతో ఈ చట్టం ద్వారా ఫోన్లు ట్యాప్ చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంక్రమించింది. కాల క్రమంలో అధికారంలో ఉన్నవాళ్లు రాజకీయ ప్రత్యర్థుల కదలికలు, వ్యూహాలు తెలుసుకోవడానికి ట్యాపింగ్ చేయించారు. ఈ క్రమంలోనే 1988లో కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న రామకృష్ణ హెగ్డేపై తమ రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్ చేయించారన్న ఆరోపణలు వచ్చాయి. ఇందులో నిజం ఉండటంతో రామకృష్ణ హెగ్డే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నీరా రాడియా టేపుల వ్యవహారం కూడా సంచలనం అయింది. ఈ నేపథ్యంలోనే టెలిఫోన్ ట్యాపింగ్ అనేది వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని 1996లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. హోం శాఖ కార్యదర్శి అనుమతితోనే ట్యాపింగ్ జరగాలని, ట్యాపింగ్ ఆర్డర్‌కు రివ్యూ కమిటీ ఆమోదం కూడా ఉండాలని, ట్యాపింగ్ 60 రోజులకు మించి చేయకూడదని, రికార్డులు సక్రమంగా ఉండాలని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. చట్టపరంగా ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించే అధికారం కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కొద్ది సంస్థలకు మాత్రమే ఉంది. ఇంటెలిజెన్స్ బ్యూరో, రా, సీబీఐ, ఎన్ఐఏ, ఐటీ, ఢిల్లీ పోలీస్ కమిషనర్ తదితరులకే అధికారం ఉంది. రాష్ట్ర స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే హోం శాఖ కార్యదర్శి అనుమతి తప్పనిసరి. తెలంగాణలో జరిగిన ట్యాపింగ్ విషయానికి వస్తే ఇక్కడ నియమ నిబంధనలను తుంగలో తొక్కారు. నక్సలైట్ల పేరిట ఎవరి ఫోన్లనుబడితే వారి ఫోన్లను ట్యాప్ చేశారు. డీజీపీ స్థాయి అధికారి సైతం స్వేచ్ఛగా ఫోన్లో మాట్లాడలేని పరిస్థితి కల్పించారు. జగన్ పాలనలో కూడా ఇలాగే సాగింది. సొంత పార్టీలకు చెందిన కీలక నాయకులపై కూడా నిఘా పెట్టించారు.

ప్రస్తుత కేసులో విచారణ ఎదుర్కొంటున్న ప్రభాకరరావు అనే రిటైర్డ్ అధికారి సిట్ అధికారులకు సహకరించడం లేదు. అయితే ఆయన ఆధ్వర్యంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించిన అధికారులు ఎవరు? వారి ముందుకు వచ్చిన అభ్యర్థనలు ఎన్ని? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయి? వంటి అంశాలను ట్యాపింగ్‌కు అనుమతించిన అధికారుల నుంచి సమాచారం సేకరిస్తే ఈ కేసు ఒక కొలిక్కి వస్తుంది. ఒకే సమయంలో, అది కూడా ఎన్నికలకు ముందు అన్ని వందల ఫోన్లు ట్యాప్ చేయడానికి ఎలా అనుమతించారు? కనీస అనుమానం రాలేదా? తమ ఆమోదానికి పంపిన జాబితాలో ఉన్న నంబర్లు ఎవరివని కనీసం ఆరాతీశారా? అని సంబంధిత అధికారులను ప్రశ్నించి సమాధానాలు రాబడితే తెర వెనుక శక్తులు బయటకు రాకతప్పదు. పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను అనధికారికంగా తెప్పించుకొని విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేయించారన్న ఆరోపణలు కూడా బలంగా వినిపించాయి. ముఖ్యమంత్రుల ఆదేశాలు లేకుండా రాజకీయ నాయకుల ఫోన్లను అధికారులు ట్యాప్ చేయరు. వందలకొద్దీ ఫోన్లను ట్యాప్ చేయడం వల్ల కింది స్థాయి అధికారులు పనిలో పనిగా తమకు గిట్టని వారి ఫోన్లను కూడా దొంగచాటుగా విన్నారు. ముంబైలో ఒక కేసుకు సంబంధించి ఫోన్ ట్యాపింగ్ చేయించారు. అయితే ఆ పనికి నియమితులైన ఆపరేటర్, తనకు ఇష్టమైన ఒక హీరోయిన్ ఫోన్‌ను ప్రతిరోజూ దొంగచాటుగా వినేవాడు. ఉన్నతాధికారుల తనిఖీలో ఇది బయటపడింది. ఈ లెక్కన ట్యాపింగ్ అనేది ఏ స్థాయిలోనైనా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం జరిపిస్తున్న దర్యాప్తులో కేసీఆర్ పాత్రకు సంబంధించిన ఆధారాలు లభిస్తాయా లేదా అన్నది వేచి చూడాలి. ఆధారాలు లభిస్తే రాజకీయంగా కేసీఆర్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవకాశం లభిస్తుంది. కేసీఆర్ ఇరుక్కుంటే జగన్‌రెడ్డి కూడా ఇరుక్కొనే అవకాశం లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నందున ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కును పరిరక్షించాలంటే నిబంధనలను మరింత కఠినతరం చేయాలి. ట్యాపింగ్‌కు జ్యుడీషియల్ అనుమతి తప్పనిసరి చేయాలి. హోం శాఖ కార్యదర్శి అనుమతికి ముందు హైకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి అనుమతి పొందడం తప్పనిసరి చేయాలి. ఆ తర్వాత కూడా కింది స్థాయి అధికారులకు వదిలిపెట్టకుండా మాజీ న్యాయమూర్తులు, సాంకేతిక నిపుణులు, పార్లమెంటు సభ్యులతో పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ కూడా సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఉండాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్యాపింగ్ ఆదేశాలపై సమీక్ష జరపాలి. పౌర హక్కులకు భంగం కలిగితే నష్టపరిహారం చెల్లించే నిబంధన విధించాలి. అమెరికాలో ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వేలెన్స్ చట్టం ప్రకారం ట్యాపింగ్ కోసం ప్రత్యేక న్యాయమూర్తుల అనుమతి తప్పనిసరి. ఇంగ్లండ్‌లో మంత్రి మండలి ఆమోదం తర్వాత ఒక సీనియర్ న్యాయమూర్తి కూడా ఆమోదముద్ర వేయాలి. జర్మనీలో పార్లమెంటరీ పర్యవేక్షణ కమిటీ అనుమతి తప్పనిసరి. చట్టాలను కఠినతరం చేయని పక్షంలో ప్రభుత్వాలే కాకుండా ప్రైవేటు వ్యక్తులు కూడా పెగాసస్ సాఫ్ట్‌వేర్ సమకూర్చుకొని వ్యాపార ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేసే ప్రమాదం ఉంది. తెలుగునాట కొంత మంది ప్రైవేటు వ్యక్తుల వద్ద ఇలాంటి ఎక్విప్‌మెంట్ ఉందన్న ప్రచారం ఉంది. ఇజ్రాయెల్‌కు చెందిన సంస్థ సరఫరా చేసిన పరికరాల్లో మూడు నాలుగు ప్రైవేటు వ్యక్తుల వద్దే ఉన్నాయట. వ్యాపార ప్రత్యర్థుల ఎత్తుగడలను ముందుగానే తెలుసుకోవడానికి కొంత మంది వ్యాపార దిగ్గజాలు ఇలాంటి అనైతిక పద్ధతులకు పాల్పడుతున్నారట. ఈ నేపథ్యంలో పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కు భద్రంగా ఉండాలంటే పౌర సమాజం కూడా ఆ దిశగా ఉద్యమించాలి. పాలకులు ట్యాపింగ్ రుచి మరిగినందున వారిని కట్టడి చేయాలంటే ప్రజలే ఉద్యమించాలి!

### 'నరుకుడు' నైజం!

ఇక, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయనకు వత్తాసు పలుకుతున్న వారిని ఎలా అర్థం చేసుకోవాలి? తాను అధికారం కోల్పోవలసి వస్తుందని కలలో కూడా ఊహించని జగన్‌రెడ్డి ఇప్పుడు కరుణామయుడి ముసుగు తొలగించి తనలోని వికృత మనస్తత్వాన్ని ప్రదర్శించడానికి ఏ మాత్రం మొహమాటపడటం లేదు.

## ఆ 6 డిమాండ్లు నెరవేర్చాలి.. మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. రాష్ట్రంలో గ్రామాల స్థితి, పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారిందని లేఖలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు వల్ల తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులు ఖర్చు చేస్తున్నారని, ఆ బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. మాజీ సర్పంచులకు సైతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల నోటిఫికేషన్ వస్తే.. బిల్లులు రావడం మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఆరు డిమాండ్లను హరీశ్‌రావు తన లేఖలో ప్రస్తావించారు.

గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, గతంలో చేసిన పనులకు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, పారిశుద్ధ్యం పెంపొందించాలని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారికి వేతనాలు చెల్లించాలన్నారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని, వెంటనే వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## గతంలో పనిచేసిన సంస్థకే కన్నం.. రూ.48

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: గతంలో పనిచేసిన సంస్థకే కన్నం వేసిన ఓ ప్రబుద్ధుడు రూ.48లక్షలు అపహరించాడు. ఈ ఘటనలో బేగంపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.46లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు.

బేగంపేట ఠాణా పరిధిలోని పాటిగడ్డ సన్ స్టీల్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గతంలో అదే కంపెనీలో పనిచేసిన గిరిదారి సింగ్‌ను వివిధ కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించారు. మొన్న అర్ధరాత్రి సన్ స్టీల్స్ కంపెనీ వెనుక వైపు నుంచి అద్దం ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. అనంతరం లాకర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగదు అపహరించుకొని బస్సులో పరారయ్యాడు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా గిరిదారి సింగ్‌ను ఆదిలాబాద్‌లో గుర్తించి అక్కడి పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు.

## 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'..

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

అమెరికా దాడులు.. ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. "మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. నక్సలిజం సమస్యపై ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఒడిశా ఉన్నతాధికారులతో అమిత్ షా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## నాన్ ట్యాక్స్ రెవెన్యూపై అధికారులు దృష్టిపెట్టాలి

మొదటి పేజీ తరువాయి

"అధికారంలోకి వచ్చిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఓఆర్ఆర్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నాం. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా.. మరికొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్‌లో అన్ని శాఖలకు సమానంగా పంచాలి. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి.. అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలి.

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన ప్రాజెక్టుల ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్ర అవసరాలు, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులు ఖర్చు చేయాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, విభాగాలపై దృష్టి సారించాలి. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పనిచేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళ్తుంది. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి"అని అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

"నేను ఆరోగ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో దీనపరిస్థితి నెలకొని ఉంది. కరోనా వల్ల ప్రపంచమంతా విలవిల్లాడిపోయింది. అమెరికా, చైనాల్లో వచ్చిన పరిస్థితులు భారత్‌లోనూ వస్తాయని భయపెట్టారు. ఎంత మంది భయపెట్టినా ప్రధాని మోదీ భయపడలేదు. దేశంలోనే కొవిడ్ వ్యాక్సిన్ల తయారీని ప్రధాని ప్రోత్సహించారు. దేశ ప్రజలకే కాదు.. విదేశాలకు కూడా వ్యాక్సిన్లు ఇచ్చి భారత్ ఆదుకుంది. మన దేశంలో మేధోశక్తి విదేశాలకు వలస పోవద్దని భావించి ప్రధాని మోదీ మేకిన్ ఇండియా అమలు చేశారు. ఎన్నో కోట్ల నిధులు ఇచ్చి స్టార్టప్ కంపెనీలను కేంద్రం ప్రోత్సహించింది" అని ఈటల చెప్పారు.

## యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

సికింద్రాబాద్: యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ నేతృత్వంలో అద్భుత, సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా భాజపా పాలిస్తోందని చెప్పారు.

"కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసిన అవినీతి వార్తలే. దేశంలో అవినీతి ప్రభుత్వం ఉండవద్దని 2014లో భాజపాని అద్భుత మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్థాన్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది. దేశంలోని పలు ప్రాంతాలను ఉగ్రవాదులు నాశనం చేశారు. హైదరాబాద్‌లోనూ పాక్ ఉగ్రవాదులు రక్తపాతం సృష్టించారు. ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా.. ఏం చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉండేది. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలో పాక్ దాడులకు గట్టిగా బదులిచ్చాం. ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా గట్టి జవాబు ఇచ్చాం"అని కిషన్‌రెడ్డి అన్నారు.

మోదీ 11 ఏళ్ల పాలన దేశానికి స్వర్ణయుగం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తెలంగాణకు మోదీ 11 ఏళ్లలో రూ.11లక్షల కోట్లు ఖర్చు చేశారని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మోదీ 11 ఏళ్ల పాలన దేశానికి స్వర్ణయుగమన్నారు. ఈటల రాజేందర్ ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఈటల ఎంపీ అయ్యి ఏడాది అయిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈటల నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. జరగబోయే ఎన్నికల్లో నేతలందరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# శాంతి స్థాపన జరిగి దశాబ్దం.. బొగోటాలో ఘనంగా యోగా దినోత్సవం

బొగోటా: కొలంబియా రాజధాని బొగోటాలోని ప్రఖ్యాత శాంటా మారియా ప్లాజాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాది మంది యోగా సాధకులు, ఔత్సాహికులు పాల్గొన్న ఈ వేడుకకు ప్రపంచ ప్రఖ్యాత యోగా గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ హాజరయ్యారు. సరిగ్గా ఒక దశాబ్దం కిందట కొలంబియా ప్రభుత్వం, తీవ్రవాద ఫార్క్ గెరిల్లా సంఘాలు శాంతి ఒప్పందం చేసుకోవడంలో గురుదేవ్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దశాబ్దాలపాటు కొనసాగిన తీవ్రవాద సాయుధ సంఘర్షణకు స్వస్తి చెప్పి పదేళ్లు పూర్తైన సందర్భంగా ఈ ఏడాది అక్కడ జరిగిన యోగా వేడుకల్లో పాల్గొనడం విశేషం. ఇది కొలంబియాలో శాంతి దశాబ్దానికి గుర్తుగా నిలిచింది.

ఈ సందర్భంగా గురుదేవ్ మాట్లాడుతూ.. యోగాను కేవలం శారీరక వ్యాయామంగా మాత్రమే అనుకోవద్దని.. ఇది మానసిక స్థితిని సైతం మార్చగలదన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ఆదరణ పొందిందన్న ఆయన.. మొట్టమొదటి కామన్ యోగా ప్రోటోకాల్‌ను రూపొందించిన కమిటీకి తాను అధ్యక్షత వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 'ప్రపంచ జనాభాలో మూడొంతులకు పైగా ప్రజలు ప్రజలు ఈ ప్రోటోకాల్‌ను



అనుసరిస్తుండటం నాకు చాలా ఆనందంగా ఉంది. మానసిక ఆరోగ్య రంగంలో మన పని ఇక్కడితో ఆగదు. నిజానికి ఇది ఆరంభం మాత్రమే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొగోటా కల్చరల్ సెక్రటేరియట్‌కి చెందిన అబ్జర్వేటరీ ఆఫ్ కల్చర్ అండ్ కల్చరల్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. 'కొన్ని వారాలుగా దేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని ఉంది. ఆ ఉద్రిక్తతలను చల్లార్చి, సమతుల్యం తీసుకురావడానికి, బొగోటా దేశ ప్రజలందరికీ ఒక సానుకూల సందేశాన్ని ఇచ్చేందుకు ఇప్పుడు సరైన సమయం వచ్చింది" అని వ్యాఖ్యానించారు. 2015లో కొలంబియాలో శాంతిస్థాపన ఇక అసాధ్యమని చాలామంది అనుకున్న సమయంలో దానిని గురుదేవ్ సాధించారు. దాదాపు 50 సంవత్సరాల పాటు ఫార్క్ తిరుగుబాటుదారులు, కొలంబియా ప్రభుత్వం మధ్య జరిగిన ఉద్రిక్తతలు, ఘర్షణలు కొనసాగాయి. అనేక శాంతి ఒప్పందాలు విఫలమై, అవిశ్వాసపు అగాధం ఇరువర్గాలలో నెలకొన్న తరుణంలో గురుదేవ్ ఫార్క్ కమాండర్లతో మూడు రోజుల పాటు మధ్యవర్తిత్వ చర్చలు నిర్వహించారు. అహింసను ఆయుధంగా స్వీకరించాలని, దేశ భవిష్యత్తు కోసం విస్తృత దృక్పథంతో చర్చలను అంగీకరించాలని వారిని కోరారు. ఆయన చొరవతో సంక్షోభానికి పరిష్కారం లభించింది. ఒక ఏడాది పాటు సంపూర్ణ కాల్పుల విరమణను ఫార్క్ ప్రకటించిన తర్వాత శాంతి ఒప్పందానికి మార్గాన్ని సిద్ధం చేసింది. పదేళ్ల తర్వాత నేడు గురుదేవ్ మళ్లీ కొలంబియాను సందర్శించారు. కేవలం దశాబ్ది ఉత్సవాన్ని జరుపుకోవడానికి మాత్రమే కాకుండా.. మరింత శాంతియుతంగా, ఐక్యతతో కూడిన దక్షిణ అమెరికాను సాధించే దిశగా వారు తమ దృష్టిని సారించారు. బొగోటా, మెడెలిన్, కార్టాజెనా వంటి నగరాల్లో, ఆయన కొలంబియా పార్లమెంట్ సభ్యులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలను కలుసుకుని, వారికి ధ్యానపు లోతైన అనుభూతిని పరిచయం చేశారు.

కొలంబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి గురుదేవ్ మాట్లాడుతూ .. 'కష్టాలనుంచి విముక్తి పొందిన ప్రపంచం.. మరింత ప్రేమభరితమైన, ఆనందం, శాంతితో నిండిన ప్రపంచం అనేది ఓ ఊహగా అనిపించవచ్చు.

# ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

**- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్**

**- షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ**

**- ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలు అందజేత**






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 22**
ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి 572 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇంద్రపూర్ లోని నగర యాదవ సంఘంలో 261 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సభ్యులు షబ్బీర్ అలీ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. రూ. 7.50 లక్షల కోట్ల అప్పులపై తమ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6500 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంటగ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో మొదటి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇంటి స్థలాలు కలిగిన పేద కుటుంబాల వారు ముందుకు వస్తే, అర్హత కలిగిన వారందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ఇల్లు మంజూరు కోసం ప్రజలు ఎవరు కూడా దళారులను ఆశ్రయించవద్దని, ఎవ్వరికీ నయా పైసా ఇవ్వకూడదని సూచించారు. పార్టీలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుతం మంజూరీ పత్రాలు అందుకున్న లబ్దిదారులు ప్రభుత్వ తోడ్పాటుతో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని హితవు పలికారు. కాగా, నగరంలో సొంత స్థలాలు లేని నిరుపేదల కోసం ప్రభుత్వ పరంగా అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ కాలనీలు నిర్మించేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# సీతారామ ప్రాజెక్టు సాగునీరు త్రాగునీరు ముందుగా ఈ జిల్లాకే ఇవ్వాలి...!!

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా**




**పినపాక (మన వెలుగు) జూన్ 22 :**
అశ్వాపురం మండలలో జరిగిన మండల 20వ సభలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషాలి మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ భూములకు నీరు అందించిన తర్వాతనే బయటకు తీసుకెళ్లాలని ఆయన అన్నారు,ప్రశ్నించే కమ్యూనిస్టుల పై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని దేశ సంపదను మోడీ అమిత్ షా దోచుకుంటున్నారని, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకునిమరి ఎన్ కౌంటర్లు చేస్తుండడం, మరోపక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్ కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య మాట్లాడుతూ**

అలాగే, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీ జిల్లా అధ్యక్షులు, నారాటి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సైరెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంక టేశ్వరరావు, మున్నా లక్ష్మి కుమారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్,సిపిఐ మండల నాయకులు, అనంతనేనీ సురేష్, అనంతనేనీ శేఖర్, మేలపుర సురేందర్ రెడ్డి, కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్ సాయి, కమటం సురేష్, అక్కెనపల్లి నాగేంద్రబాబు, దండి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల రక్షణ కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాలి

**- ప్రొ.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్**

**- ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ)**






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 22**
టీయూసీఐ జెండాను రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ ఆవిష్కరించడం జరిగింది. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లింబాద్రి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ పోరాటాల వల్లనే హక్కులు దక్కుతాయని, కార్మిక హక్కుల రక్షణ కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలే కాకుండా ప్రభుత్వాలు సైతం శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ఒక గొప్ప సమాజ నిర్మాణం కోసం ఈ మహాసభల వేదికగా చర్చ జరగాలని, ఆ వైపుగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సామ్రాజ్యవాద శక్తులతో మతోన్మాద శక్తులు కలిసి దేశాన్ని పీడిస్తున్నాయి...**

టియుసిఐ ఆల్ ఇండియా అధ్యక్షులు అమ్రిష్ పటేల్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వనమాల కృష్ణ, కే.సూర్యం లు మాట్లాడుతూ
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ప్రపంచాన్ని సామ్రాజ్యవాదం పీడిస్తుంటే, మన దేశాన్ని సామ్రాజ్యవాద శక్తులతో కలిసి మతోన్మాత శక్తులు పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా గాజా, ఇరాన్ లపై ఇజ్రాయిల్, అమెరికా యుధోన్మాద దాడులను ఖండిస్తున్నామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్నదని ఆరోపించారు. మోడీ ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల్ని చైతన్యం చేస్తామన్నారు. దేశంలోని 40 కోట్ల మంది కార్మిక వర్గం మోడీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. వచ్చేనెల 9న కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా మోడీ ప్రభుత్వానికి కార్మిక శక్తిని తెలియజేస్తామన్నారు.
కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ ఎస్ఎల్ పద్మ, ఎం.హన్మేష్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు కే.రాజన్న, జీ.రామయ్య, సి. వెంకటేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, రాజేశ్వర్, ముత్తెన్న, మల్లేష్ సత్యక్క, రమేష్, యాకుబ్ షావలి, వెంకట్, రెడ్డి, అశోక్, సాంబశివుడు, కిరణ్, ప్రసాద్, హనుమంతు, రాజు, దేవదానం, రామ్ లక్ష్మణ్ తదితరులు మరియు వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ లతో భేటీ అయిన కలెక్టర్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 22 :**
నిజామాబాద్ నగరంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఆదివారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసన మండలి సభ్యులు బి. మహేశ్ కుమార్ గౌడ్ లతో జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి భేటీ అయ్యారు. రోడ్లు - భవనాల శాఖ అతిథి గృహం వద్ద వారికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లతో కలెక్టర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. జిల్లా ప్రగతికి చేపట్టాల్సిన చర్యలు, కొత్త పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న అవకాశాలు తదితర విషయాలపై పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకున్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికార యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందేలా చూస్తామని షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ గౌడ్ లు తెలిపారు. ఈ భేటీలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, సహకార యునియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# కొందరికి విద్య జ్ఞానం కోసం అయితే...మరికొందరికి అదే విద్య డబ్బులు సంపాదించడానికి దందాగా మారింది



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 22 :**
బీసీ విద్యార్థి సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు జెట్టి నరేంద్ర ఆదివారం నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొందరికి విద్య జ్ఞానం కోసం అయితే మరికొందరికి అదే విద్య డబ్బులు సంపాదించడా నికి దందాగా మారింది.. అని అలాంటి పరిస్థితులే నేటికీల వెలుగుచూస్తున్నాయి. వివరాల్లోకి వెళితే జూన్ మాసంలో వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు మళ్లీ తెరుచుకున్నాయి. దీనినే అదునుగా చేసుకొని ప్రైవేట్ పాఠశాలలు నయా దందాను మొదలుపెట్టాయి. వారి ఇష్టానుసారంగా ఫీజులను పెంచి పేదోడు, మధ్యతరగతి, ఉన్నవాడు అని చూడకుండా ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డిని విరుస్తున్నాయి. అలాగే వారికి సంబంధించిన పాఠశాలలోని పుస్తకాలు కూడా కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులతో చెప్పడం మరియు విద్యార్థులతో చీటీలు రాసి పంపడం కోసమెరుపు.... ఒకవేళ తల్లిదండ్రులు వారికి తెలిసిన బుక్స్ స్టాల్ కి వెళ్లి తీసుకొస్తే మేము రాసిచ్చిన దాంట్లోనే తెచ్చుకోవాలని లేదంటే ఈ బుక్కులు పనిచేయవని చెప్పడం పాఠశాల యాజమాన్యం తీరు. కనీస వసతులు లేని అనగా పాఠశాలకి అనుమతు లు సరిగా ఉండవు మరియు పిల్లలు ఆడడానికి ప్లేగ్రౌండ్ కూడా లేని ఎన్నో ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అలాంటి పాఠశాలలను ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు అనేది ప్రశ్నగా మారింది. ఉన్నతాధికారులకు ఏమైనా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఆమ్యామ్యాలు ముట్టయిస్తున్నారేమో అన్న అనుమానాలు ఉన్నాయి.. డి.ఈ.ఓ మరియు ఎం.ఈ.ఓ కుమ్మక్కయ్యారు అని విద్యార్థుల తల్లిదండ్రులు గుసగుసలాడుతున్నారూ. ఇకనైనా ఉన్నతాధికారులు కల్లుతెర్చుకొని విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలని, విద్యార్థుల కు రానున్న రోజుల్లో ఇలాంటివి పునరుద్ధరానా కాకుండా చూసుకోవాలి లేని పక్షాన కలెక్టర్ ఆఫీస్ ముట్టడి పిలుపునిస్తామని జెట్టి నరేంద్ర అన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి నాయకులు శ్యామల దినేష్, కర్ణాల గౌతం కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇండ్లు నిర్మిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దే

**- కోమిరెడ్డి విజయ్ ఆజాద్**



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 22 :**
వెంకట్రావ్ పేట్ వార్డు కాంగ్రెస్ ఇంచార్జి కొమిరెడ్డి శేషు ఆహ్వానం మేరకు ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ వేడుకలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ గారు, వారి వెంట పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ ఆజాద్ మాట్లాడుతూ.. గతంలో మెట్పల్లి నియోజకవర్గంలో అత్యధికంగా ఇండ్లు ఇచ్చిన ఘనత స్వర్గీయ కొమిరెడ్డి రాములుదే అని గుర్తు చేశారు. మళ్ళీ ఇప్పుడు ఇంత భారీ ఎత్తున ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే అని గుర్తు చేశారు, ఇట్టి కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ప్రేమలత, వార్డు యూత్ కాంగ్రెస్ ఇంచార్జి మోర్తాడ్ మనోజ్ , ఏశాల శేఖర్ , కడెం హేమ, నర్సింలు గౌడ్, చీకట్ల కమలమ్మ, మొదిన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలిల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటా

**- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 22 :**
నిజామాబాద్ నగరంలోని మాధవనగర్లో గల బీఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ పద్మశాలి సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డా. రేకులపల్లి భూపతిరెడ్డి



మాట్లాడుతూ, పద్మశాలిల పట్ల తనకు ప్రత్యేక గౌరవం, అభిమానం ఉందని, పద్మశాలీల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.
రూరల్ నియోజకవర్గంలోని బోర్గంలో పద్మశాలి సంఘం కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు తన ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా తెలిపారు.
జిల్లా పద్మశాలి సంఘం కోసం గంగస్థాన్ ఫేజ్-2, ఉత్తర తిరుమల దేవస్థానం సమీపంలో అర ఎకరం స్థలాన్ని కేటాయించి, కలెక్టర్ ద్వారా సీసీల్ కు పంపించి పత్రాల ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆ స్థలాన్ని సంఘానికి అందజేస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలిల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.
నూతనంగా ఎన్నికైన సంఘ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి , ఇతర కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పద్మశాలి సంఘం తరఫున ఆయనను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ మానల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హుందాన్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ఉప్పు గంగారెడ్డి,పీసీసీ డెలికెట్ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, 26 తర్పాల పద్మశాలి కార్యవర్గ సభ్యులు, భారీ సంఖ్యలో పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దోపిడి వ్యవస్థ ఉన్నంతవరకు కమ్యూనిస్టులు ఉంటారు






## - సిపిఐ నగర మహాసభ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 22 :**
నిజామాబాద్ నగరంలో డివిజన్-1 లో గల రైస్ మిల్ ఫీట్టర్స్ ఏఐటియుసి కార్యాలయంలో వై.ఓమయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను స్వాధీనం చేసుకొని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం కోసమే ఆపరేషన్ కగార్ నిర్వహిస్తూ బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని అన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన తర్వాత కూడా వారిపై దాడి చేసి చంపడం క్షమించరానిదని అన్నారు. అర్బన్ నక్సలైట్ పేరుతో కమ్యూనిజంను తుడిచిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని అన్నారు. పాలక ప్రభుత్వాలు పేదలకు,కార్మిక వర్గానికి దోపిడీ చేస్తున్నంత కాలం ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని అన్నారు. సిపిఐ ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ,ప్రజా సంఘాలు మరింత విస్తృతంగా ప్రజా,కార్మిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని అన్నారు నిజామాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి గత 20 సంవత్సరాలుగా వందలాది కోట్లు ప్రభుత్వం వెచ్చించినప్పటికీ ఇంకా నగర ప్రజలకు ఉపయోగంలోకి రాకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనని అన్నారు. నగర సమస్యలపైన ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు ఈ మహాసభను ఉద్దేశించి సిపిఐ జిల్లా నాయకులు కే.రాజన్న ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర నూతన కౌన్సిల్ ఎన్నుకోవడం జరిగింది, అందులోని కార్యవర్గ్యులు నగర కార్యదర్శి వై.ఓమయ్య, కార్యవర్గ సభ్యులుగా ఫిరోజ్ ఆలీ, బి అనిల్, పి రంజిత్, నాంపల్లి దేవేందర్, ఎస్ భానుచందర్, పి నర్సింగరావు, పి హనుమన్లు, బి రఘురాం, సురేష్, ముత్యాలు, లింబాద్రి, భాగ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ప్రతి ఇంటికి తప్పక ఇంటి పన్ను ఇవ్వాలి

## - సిపిఎం పార్టీ నాయకులు దండి రాములు

**పినపాక (మన వెలుగు) జూన్ 22 :**



అశ్వాపురం మండలం మల్లెల మడుగు గ్రామపంచాయతీ లోని 1986 గోదావరి మునిగిపోతే మళ్ళీ పేద ప్రజలు ఇల్లు నిర్మించుకొని 40 సంవత్సరాల నుంచి నివాసముం టున్నటువంటి పేద ప్రజలందరికీ గ్రామపంచాయతీలో ఇంటి పన్ను తప్పక ఇవ్వాలని అదేవిధంగా పట్టాలు లేని పేద ప్రజలందరికీ పట్టాలు ఇవ్వాలని అదేవిధంగా వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని మల్లెల మడుగు సిపిఎం పార్టీ గ్రామ శాఖ తరపున శాఖ కార్యదర్శి దండి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా మల్లెల మడుగు గ్రామపంచాయతీలో సిపిఎం పార్టీ పిలుపుమేరకు గ్రామంలో ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే చేసి సమస్యలు గుర్తించి ప్రభుత్వ అధికారుల దృష్టికి ఎంపీడీవో కి గతంలో సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగిందని కావున అట్టి సమస్యలపై ఎంపీడీవో వెంటనే స్పందించి గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

# మన ఊరు మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల పని పూరి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం కోరుట్ల ఎమ్మెల్యే.


కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన ఇంచార్జ్ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ నేతృత్వం లో నిర్వహించినటువంటి సమీక్ష సమావేశంలో పాల్గొన్న.కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్. సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. కొరత ఉందని రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని తగినంత అందుబాటులో ఉంచాలని కోరారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో మొదలు పెట్టినటువంటి పాఠశాల పనులను వెంటనే పూర్తి అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని సందర్భంగా తెలియజేశారు. కొన్ని రోజుల క్రితం కోరుట్లలోని గణపతి విగ్రహాల తయారీ కేంద్రం వద్ద విద్యుత్ షాక్ తో మరణించిన అల్వాల వినోద్ భార్య శైలజ ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు మెట్ పల్లి గవర్నమెంట్ హై స్కూల్ శిథిలా వ్యవస్థలో ఉందని రానున్న వర్షాకాలంలో తీవ్ర వర్షాలు కురిస్తే కూలిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే వివరించగా.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. వెంటనే కలెక్టర్ తెలియజేస్తూ మెట్పల్లి పాఠశాల లో ఉన్న విద్యార్థులను వేరే ఏదైనా భవనంలోకి మార్చాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రగతిశీల యువజన సంఘం( పి వై ఎల్ ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం




మహబూబాబాద్ లోని బట్టు అంజయ్య స్మారక భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ మోకాళ్ళ రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పి వై ఎల్ .రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. సీజనల్ వ్యాధులలు ప్రధానంగా ఏజెన్సీ తీవ్రంగా విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా ,రోగాలతో ఆదివాసి గిరిజన పేద ప్రజలు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాలు లేవు. ఖాళీగా ఉన్న డాక్టర్స్ సిబ్బంది పోస్టులు భర్తీ చేయడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. టెండర్ల ప్రభుత్వ ఆస్పత్రులలో కనీస సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తే విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ కొనసాగుతుంది ప్రభుత్వ అధికారులు పట్టీ పట్టణట్లుగా వ్యవహరిస్తున్నారు. . అంతేకాకుండా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ , ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి చేతులు దులుపు కూడా తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. రాజీవ్ యువ కిరణాలు పథకం పేరుతో నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అర్హులైన వారి కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు సెలక్షన్ చేసి మరొకసారి మోసం చేశాని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగ పోస్టులు ఏ ఒక్కటి కూడా భర్తీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే విధానాల అవలంబించి ప్రజల చేతులు చావు దెబ్బ తిన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవలంబిస్తుంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్స్ మరియు సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ వైద్య అధిక ఫీజు దోపిడిన అరికట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులు అన్నిటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు తుడుం వీరభద్రం, దారావత్ రవికుమార్, బేజాడి కుమార్,పరిషిక రవి, సిద్దేశ్వర్, సిద్ధులు, చింత నరసింహారావు ,బట్టు చైతన్య, సామ పాపయ్య ,గణేష్,చారీ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం మండల స్థాయిలో మెగా టాలెంట్ టెస్ట్.







మహబూబాద్ జిల్లా బయ్యారం మండలం లో గాయత్రి టెక్నో మోడల్ స్కూల్ లో మండల స్థాయి మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుంది తేదీ జూలై 13 ఆదివారం 11 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుంది గాయత్రి మోడల్ టెక్నో స్కూల్లో నవోదయ గురుకులం సైనిక్ మోడల్ స్కూల్ లకు కూడా సిలబస్ మరియు క్లాసెస్ నిర్వహించడం జరుగుతుంది ఎంతో అనుభవజ్ఞులైన టీచర్లతో బోధన నిర్వహించడం జరుగుతుంది పిల్లల ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించే తల్లిదండ్రులు మీ పిల్లలను గాయత్రి టెక్నో మోడల్ స్కూల్ కు పంపించగలరని మనవి అడ్మిషన్లు జరుగుచున్నవి టాలెంట్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన వారికి మొదటి బహుమతి 10116 రెండవ బహుమతి5116 మూడో బహుమతి 3116 అందించడం జరుగుతుంది టాలెంట్ టెస్ట్ గాయత్రి టెక్నో మోడల్ స్కూల్ కరస్పాండెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది

# అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి.

- **బయ్యారం మండల వ్యాప్తంగా మహా ధర్నాకు పిలుపునిచ్చిన బిఆర్ఎస్ పార్టీ**



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఎదుట జూన్ 23న మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంట్లో అర్హత కలిగినప్రతి పేదవాడికి మంజూరు చేయాలని డిమాండ్ సైడ్ కాలువలో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు వెంటనే తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని డిమాండ్ మంచినీళ్ల బావులు నీటి నిల్వలు ఉన్నచోట తక్షణమే బ్లీచింగ్ చెల్లించాలి వీధిలైట్లు వెంటనే వేయాలి ఇండ్లలో చెత్తను ప్రతిరోజు సేకరించి డంప్ యాడికి పంపించాలి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి పైలెట్ ప్రజలకు ప్రాజెక్టుల కింద తీసుకున్న గ్రామాలను సమస్యలు తెలుసుకుని స్పెషల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసి పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాతా గణేష్ పాలను గాలికి వదిలేసి అబద్దాలతో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజల జీవితాలతో ఆడుకుంటూ టైంపాస్ చేస్తూ కాలం గడుపుతున్న కాంగ్రెస్ పార్టీకి నిరసనగా బి ఆర్ ఎస్ పార్టీ ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చింది

# ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కలిసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన అనంతరం డిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే ను శాలువాతో సన్మానించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

# పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



జంతు ప్రేమికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంధం బాబురావు, కోల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో నిరుపేదలైనటువంటి ఐదు కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి నాలుగు నెలల నుంచి వారి ఉదార హృదయంతో నిరుపేదలకు సహాయం చేస్తున్నటువంటి మీసాల సత్యనారాయణ,మీ సాల ఆశ్లేష,జ్యోతి,మీసాల కళ్యాణ కుమార్, సంతోష్ రెడ్డి,వై.హరీష్ రెడ్డి,సత్య వెంకట్, రోహిత్ రెడ్డి వారికి ధన్యవాదాలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో రామిడి కుమార్,గ్యాస్ శ్రీనివాస్,నల్ల సత్యనారాయణ, రామిడి లక్ష్మి కాంత్, బత్తుల మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యంగం వల్లే భారత దేశంలో మైనారిటీలకు రాజ్యం రక్షణ కవచంగా ఉంది

- **మైనారిటీ హక్కుల ప్రదాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్**
- **ఎమ్ ఎ ఖయ్యూం (మాజీ టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్,మేడ్చల్ నియోజకవర్గం)**

ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డా బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 219వ వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించబడింది.ఈ ఆదివారం రోజున ముఖ్యఅతిథిగా ఎమ్ ఎ ఖయ్యూం (మాజీ టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్,మేడ్చల్ నియోజకవర్గం) విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఎమ్ ఎ ఖయ్యూం మాట్లాడుతూ ముస్లింలు ముందు నుండి డా బాబాసాహెబ్ అంబేద్కర్ కి అండగా ఉన్నాం,ఇప్పుడు అంబేద్కర్ ఉద్యమానికి కూడా ముందుకు తీసుకువెళ్లడానికి కూడా ముందు ఉంటాం అని తెలియజేస్తున్నాం."ఒక ప్రజాస్వామ్యం నిజంగా ఎంత బలంగా ఉందో,అది మైనారిటీలు ఎంతగా రక్షణ పొందుతున్నారో బట్టి తెలుసుకోవచ్చు.గౌరవం,సమానత్వం,రాజ్యాంగ రక్షణ లేకుండా స్వాతంత్ర్యం లాభం లేదు." అని అంబేద్కర్ మాటలు గుర్తుచేశారు." మైనారిటీలు హక్కులు కాపాడడమే నిజమైన ప్రజాస్వామ్యం.ఇది రాజ్యాంగ ధర్మం,దేశ నిర్మాణానికి ఆధారం."ఈరోజు భారత దేశ ప్రజలు అందరూ సుఖ శాంతులతో ఉన్నారు అంటే డా.బాబాసాహెబ్ అంబెద్కర్ అందించిన భారత రాజ్యాంగం వల్లే అని తెలియజేసారు.ప్రపంచం మొత్తం భారత దేశం వైపు చూస్తుంది అంటే భారత దేశం యొక్క ప్రజాస్వామిక విలువలవల్లే ఆ ప్రజాస్వామిక విలువలు అందించింది భారత రాజ్యాంగం అని తెలియజేసారు.ప్రతివారం ఇలా భారత రాజ్యాంగ పీఠిక పై ప్రమాణ స్వీకారం చేయించటం భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలలోకి తీసుకెళ్లడమే అని తెలియజేసారు. జై భీమ్ జై మీం అని నినాదించారు.ఈ విధమైన కార్యక్రమాలతో ప్రజలని చైతన్య పరుస్తున్న యం.అరుణ్ కుమార్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ సభ్యుల కృషిని గుర్తిస్తూ,అందరికి శాలువా కప్పి సత్కరించడం జరిగింది.ఈరోజు రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ 151 జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి ఎమ్ ఎ ఖయ్యూం పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఛత్రపతి సాహు మహారాజ్ జీవిత చరిత్రని తెలుసుకోవటం జరిగింది.సాహూ మహారాజ్ జూన్ 26 వ తేదీన 1874 న ఘాట్గే కుటుంబంలో జన్మించాడు.సాహూ మహారాజ్ అసలు పేరు యశ్వంత్ రావు ఘాట్గే.సాహూ తల్లిదండ్రులు రాధాబాయి-జయసింగ్ ఆబాసాహెబ్ ఘాట్గేలు.సాహూ తండ్రి జయసింగ్ ఆబాసాహెబ్ ఘాట్గే కాగల్ సంస్థానానికి అధిపతి.సాహూ తల్లి రాధాబాయి ముధోల్ మహారాజ్ తనయ.1894 నుండి 1922 వరకు ఛత్రపతి సాహూ కొల్హాపూర్ సింహాసనాన్ని 28 సంవత్సరాలు పరిపాలించారు. అతను విద్యావంతులైన విద్యార్థులకు తగిన ఉపాధిని కూడా కల్పించాడు,చరిత్రలో మొట్టమొదటి ధృవీకృత చర్య (బలహీన వర్గాలకు 50% రిజర్వేషన్) కార్యక్రమాలను సృష్టించాడు.ఉపాధి కల్పించడానికి 1906 లో సాహూ ఛత్రపతి వీవింగ్ మరియు స్పిన్నింగ్ మిల్లును ప్రారంభించాడు.వివిధ జాతులు మరియు మతాల కోసం అతను హాస్టళ్లను స్థాపించాడు.వెనుకబడిన కులాల నుండి పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం



షాహు అనేక స్కాలర్షిప్లను ప్రవేశపెట్టాడు.తన రాష్ట్రంలో అందరికీ తప్పనిసరి ఉచిత ప్రాథమిక విద్యను ప్రారంభించాడు.జ్యోతిబా ఫులే రచనల ద్వారా షాహు ప్రభావితమయ్యాడు మరియు ఫులే చేత ఏర్పడిన సత్య షోధక్ సమాజ్ ను దీర్ఘకాలంగా పోషించాడు. అంటరాని కులాల కోసం ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ల వ్యవస్థను ప్రవేశపెట్టాడు (బహుశా మొదటిది) అందుకే అతని భారతదేశ రిజర్వేషన్ల పితామహుడు కీర్తించారు.అతను కులాంతర వివాహం చట్టబద్ధం చేశాడు మరియు మహిళలకు విద్యను అందించడానికి పాఠశాలలను స్థాపించాడు.మహిళల విద్య అనే అంశంపై కూడా గట్టిగా మాట్లాడాడు,1917 లో వితంతు పునర్వివాహాన్ని చట్టబద్ధం చేశాడు మరియు బాల్యవివాహాలను ఆపే ప్రయత్నాలు



చేశాడు.వ్యాయామశాలలు మరియు కుస్తీ పిచ్లను ఏర్పాటు చేశాడు.యువతలో ఆరోగ్య స్పృహ యొక్క ప్రాముఖ్యతను ఎత్తి చూపాడు.యువకుడైన అంబేద్కర్ యొక్క గొప్ప తెలివితేటలు మరియు అంటరానితనం గురించి అతని విప్లవాత్మక ఆలోచనలతో మహారాజు బాగా ఆకట్టుకున్నాడు.1920 మార్చి 21%-%22 మధ్య కాలంలో అంటరానివారి శ్రేయస్సు కోసం వారు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు మరియు సమాజంలోని వేరుచేయబడిన విభాగాల మెరుగుదల కోసం పనిచేసే నాయకుడు అంబేద్కర్ అని షాహు అంబేద్కర్ను చైర్మన్గా చేశారు.అతను అంబేద్కర్కు 2,500 రూపాయలు,1921 జనవరి 31 న తన వార్తాపత్రిక 'మూక్నాయక్' ను ప్రారంభించినప్పుడు సహకారం అందించారు.సాహూ మహారాజ్ 1922 మే 6 న ముంబైలో నిర్యాణం చెందారు అని వివరించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు ఎం.అరుణ్ కుమార్.ఈ ఆదివారం రోజు సూక్తి చెప్పారు లలిత్:మనస్సును పెంపొందించుకోవడం మానవ ఉనికి యొక్క అంతిమ లక్ష్యం అని అంబేద్కర్ మాటలు గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో మేకల దాసు(అధ్యక్షుడు,అంబేద్కర్ యువజన సంఘం),కడుపోల మల్లేష్(మాజీ కౌన్సెలర్,ఘట్కేసర్ మున్సిపాలిటీ),కట్కూరి నర్సింగ్ రావు, సలీమ్ పాషా,మీసాల రాజేష్ కుమార్,కఫీయుద్దీన్,ఎం ఏ ఖలీల్, ఎం డీ అక్బర్ పాషా,అక్బర్, ఫరూక్, నయీముద్దీన్, పాషా భాయ్, జబ్బార్, మాసూమ్, ఫాసి, రఫీ, విజయ్, కడుపోల రాజు, బోడు నర్సింగ్ రావు,ఈ జగదీష్, కృష్ణంరాజు, ఎస్ వినోద్ కుమార్, సి.నిఖిల్, ఇ విష్ణు, జె అఖిల్, బి వివేక్, లలిత్ తదితరులు పాల్గొన్నారు.



# అప్పుడు నాన్న అలా.. ఇప్పుడు నేను

## శివుడి పాత్రపై అక్షయ్ కుమార్

తన తండ్రి గురించి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఆసక్తికర విషయం చెప్పారు. ఆయన ఓ సినిమాలో శివుడిగా నటించారని తెలిపారు. ఆ మూవీ పేరు గుర్తులేదని, విజువల్స్ కోసం ఇంకా అన్వేషిస్తున్నా అని అన్నారు. తానూ రెండు సార్లు శివుడిగా నటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. పరమేశ్వరుడి అనుగ్రహంతోనే అది సాధ్యమైందన్నారు. 'ఓ మై గాడ్ 2' తర్వాత 'కన్నప్ప' లో లార్డ్ శివగా నటించారు అక్షయ్. విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కన్నప్ప' ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా విష్ణుతో కలిసి అక్షయ్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు."మా నాన్నది అమృత్‌సర్. నాన్న ఉద్యోగం కోసం ముంబయికి షిఫ్ట్ అయ్యాం. అప్పుడు నాకు 5 ఏళ్లు. ఆయనకు సినిమా షూటింగ్ చూడడం చాలా ఇష్టం. అందుకే ఎక్కడ జరిగినా వెళ్లేవారు. అలా ఓ సినిమా చిత్రీకరణ సమయంలో (1971).. ఆయన్ను గమనించిన ఆ మూవీ టీమ్‌లోని ఒకరు 'నటిస్తావా?' అని అడిగారట. అలా తక్కువ నిడివి కలిగిన శివుడి పాత్రను నాన్న పోషించారు. ఆయన నటించిన ఆ ఒకే ఒక్క సినిమా కోసం ఇప్పటికీ వెతుకుతున్నా" అని అక్షయ్ కాస్త భావోద్వేగంతో తెలిపారు.'కన్నప్ప' మూవీ కోసం విష్ణు చాలా కష్టపడి పని చేశారని తెలిపారు. యాక్టింగ్, ప్రొడక్షన్, స్టంట్ కొరియోగ్రఫీ.. ఇలా అన్ని విభాగాల్లోనూ యాక్టివ్‌గా ఉండేవారని కొనియాడారు. తన పాత్ర నిడివి తక్కువే అయినప్పటికీ ఓపికతో విష్ణు కథ మొత్తం చెప్పారని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు కన్నప్ప గురించి తెలియదని, ఆయన కథతో వచ్చిన సినిమాలనూ చూడలేదన్నారు. తానెప్పుడూ ఒక సినిమా పూర్తయిన తర్వాతే మరో చిత్రంలో నటిస్తానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ముకేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కన్నప్ప'లో ప్రభాస్, మోహన్‌లాల్, మోహన్‌బాబు, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. విష్ణు కుమార్తెలు, కుమారుడు ఈ సినిమాతోనే తెరంగేట్రం చేస్తున్నారు.


# సినీ నటుడు విజయ్ దేవరకొండపై కేసు



ప్రముఖ సినీనటుడు విజయ్ దేవరకొండపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 26వ తేదీన రాయదుర్గం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ గిరిజనులను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు గిరిజనులను అవమానపరిచేలా ఉన్నాయని గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయ్ దేవరకొండపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. ఈమేరకు మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరోగ్య సమస్యలపై తొలిసారి

## మాట్లాడిన సల్మాన్ ఖాన్



ఇప్పటివరకూ పెళ్లి చేసుకోకపోవడం, ఆరోగ్య సమస్యల గురించి బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ 59 ఏళ్ల వయసు వచ్చినా పెళ్లి చేసుకోకపోవడంపై బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్ ఖాన్ స్పందించారు. వివాహం, విడాకులు భావోద్వేగపరంగా, ఆర్థికంగా ఎంతో కఠినమైన విషయాలన్నారు. వాటిని కొనసాగించడం అంత సులభం కాదని చెప్పారు. ఈ మేరకు 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ' షోలో పాల్గొన్న సల్మాన్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సల్మాన్ తొలిసారి తన ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడారు. తాను 'ఏవీ మాల్ఫోర్మేషన్' 'బ్రెయిన్ ఎన్యోరిజమ్'తో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. "ఒక నటుడిగా ఈ రంగంలో రాణించాలంటే మనమెంతో కష్టపడాల్సి ఉంటుంది. యాక్షన్ సీక్వెన్స్‌లు చేస్తున్నప్పుడు తరచూ గాయాలు అవుతుంటాయి. ట్రైజెమినల్ న్యూరల్జియా (ముఖ భాగంలో వచ్చే తీవ్రమైన నొప్పి), ఏవీ మాల్ఫోర్మేషన్ (రక్తనాళాల్లో నెలకొన్న అసాధారణ పరిస్థితి), బ్రెయిన్ ఎన్యోరిజమ్ (మెదడులో వచ్చే చిన్నపాటి సమస్య) ఉన్నప్పటికీ నేను వర్క్ కొనసాగిస్తున్నా. ఎన్ని ఇబ్బందులున్నా వృత్తిపరంగా కాస్త విరామం తీసుకోవాలనే ఉద్దేశం మాత్రం నాకు లేదు. వీటితోనే జీవితాన్ని కొనసాగిస్తున్నా. చిన్నతనం నుంచే ఇలాంటి సమస్యలు ఉంటే ఇప్పటికే దానిని అధిగమించేవాడిని. ఇప్పుడు వీటిని అధిగమించేందుకు నన్ను నేను రీస్టార్ట్ చేసుకుంటున్నా" అని ఆయన అన్నారు.అనంతరం తన మిత్రుడు ఆమిర్ ఖాన్ రిలేషన్‌షిప్ గురించి మాట్లాడారు. "ఆయనొక అద్భుతమైన వ్యక్తి. పర్‌ఫెక్షనిస్ట్ అని ఈ ప్రపంచానికి తెలుసు. వివాహం విషయంలోనూ పర్‌ఫెక్షన్ వచ్చే వరకూ ఆయన ఈ బంధాలను కొనసాగించేలా ఉన్నారు. (గౌరీ స్ప్రాట్‌తో ఆమిర్ ప్రేమాయణాన్ని ఉద్దేశించి) నాకు తెలిసి ఇదే ఆయన చివరి లవ్‌స్టోరీ అవ్వొచ్చు. ఈసారి తప్పకుండా రిలేషన్‌షిప్‌లో పర్‌ఫెక్షన్ పొందుతారు అనుకుంటా" అని సల్మాన్ నవ్వులు పూయించారు. 'తేరీ నామ్'లో తన లుక్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాలో తన హెయిర్ స్టైల్ డిజైన్ చేశారని చెప్పారు.




# పరమ్ సుందరి పలకరించేది ఆగస్టులో?

'పరమ్ సుందరి'గా త్వరలో ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ యువ కథానాయిక జాన్వీ కపూర్. ఆమె, సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో 'దస్వీ' ఫేమ్ దర్శకుడు తుషార్ జలోటా తెరకెక్కిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతున్న ఈ సినిమాను వచ్చే నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఇప్పుడీ 'పరమ్ సుందరి' రాకకు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. జులైలో సినిమాల విడుదలలు ఎక్కువగా ఉండడం వల్ల దీన్ని ఆగస్టులో థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. దినేశ్ విజన్ నిర్మాత. ప్రస్తుతం జాన్వీ జాబితాలో 'పెద్ది', 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' లాంటి చిత్రాలున్నాయి.

## అయ్యో ఏమిరా.. ఈ జీవితం!

"బకాసుర రెస్టారెంట్' చిత్రంలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు థ్రిల్‌తో పాటు వినోదాన్ని పంచిస్తుంది" అన్నారు దర్శకుడు ఎస్‌జే శివ. వైవా హర్ష టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి సంయుక్తంగా నిర్మించారు. ప్రవీణ్ ప్రధాన పాత్రధారిగా నటించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని "అయ్యో ఏమిరా ఈ జీవితం" అనే గీతాన్ని దర్శకుడు హరీశ్ శంకర్ ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకు వికాస్ బాడిస స్వరాలు సమకూర్చగా.. విష్ణువర్ధన్ సాహిత్యమందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ.. "ఇదొక వినూత్నమైన కథతో రూపొందుతున్న సినిమా. తప్పకుండా అందర్నీ అలరిస్తుందనే నమ్మకముంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.



# సినిమాల్లో అది సాధ్యపడకపోవచ్చు

## ఇష్టమైన పాత్రపై పవన్ కల్యాణ్

సినిమాల్లో తాను ఇప్పటివరకూ పోషించిన పాత్రల్లో ఇష్టమైన క్యారెక్టర్ గురించి ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర విషయం చెప్పారు. "ఇప్పటివరకూ పోషించిన పాత్రల్లో పూర్తి స్థాయిలో నా మనసుకు చేరువైంది ఏదీ లేదు. ప్రతి పాత్రలో కొన్ని లక్షణాలు మాత్రమే నచ్చాయి. నిజ జీవితంలో ఎలా ఉంటానో అదే విధంగా వెండితెరపైనా కనిపించాలని ఉంది. కానీ అది సినిమాల్లో సాధ్యపడకపోవచ్చు. ప్రేక్షకులు ఆ సినిమాను ఆదరించకపోవచ్చు" అని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.నటన నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టడంపైనా పవన్ మాట్లాడారు. తన తండ్రి వల్లే రాజకీయాలపై అవగాహన వచ్చిందని చెప్పారు. "సినిమాల్లోకి అడుగుపెట్టాలని, నటుడిగా మారాలని ఎప్పుడూ అనుకోలేదు. మాదొక మధ్య తరగతి కుటుంబం. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి. కమ్యూనిస్టు భావాలను పాటించేవారు. ఆయన వల్లే మా కుటుంబ సభ్యులకు రాజకీయాలపై అవగాహన వచ్చింది. నేను అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టినప్పటికీ సమాజంపైనే నా దృష్టి ఉండేది. ఆ ఆలోచనతోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టా" అని పవన్ తెలిపారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ ఒకానొక సమయంలో బాలీవుడ్‌లో మంచి సినిమాలు వచ్చేవి. 'దంగల్' లాంటి చిత్రాలు ఇప్పుడు రావడం లేదు.. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా వారు కథలు అందించలేకపోతున్నారు అని పవన్ పేర్కొన్నారు.సినిమాల విషయానికి వస్తే.. పవన్ కల్యాణ్ ప్రస్తుతం హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్', సుజీత్ డైరెక్షన్‌లో 'ఓజీ' చేస్తున్నారు. ఈ రెండూ చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆయన హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. క్రిష్, జ్యోతికృష్ణ రూపొందించారు. జులై 24న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావిస్తోంది.